# అర్ధాంగి



– కాకర్ల లక్ష్మి

"నేను అతనితో మాట్లాడాలి" అన్న పెళ్ళి కూతురు మాధురి మాటలకి అందరూ ఆశ్చర్యపో యారు.

"నాకేమీ అభ్యంతరం లేదు!" అన్నాడు చంద్రం.

ఇద్దరూ పక్కగదిలోకి వెళ్లి కూర్చున్నారు.

చంద్రం బికాం పాసయ్యాక పై చదువులు చద వకుండా ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. తండ్రి సాధారణ ఉద్యోగి. ఇద్దరు ఆడపిల్లల పెళ్ళి ళ్లకి ఉన్న ఇల్లులేనిదయ్యింది. తన అక్కల పెళ్ళి ళ్లకి తండ్రి ఎంత కష్టపడ్డాడో చూసిన చంద్రానికి కట్నం అంటే అసహ్యం వేసింది. ఆ మాటే తల్లిదం డ్రులతో చెప్పాడు.

"నీ ఇష్టప్రకారం కానీ నీ కట్న కానుకలతో నా అవసరాలు తీర్చుకోవాలని గానీ అనుకోవడం లేదు" అన్నాడు తండ్రి.

ఎన్నో సంబంధాలు చూశారు.

పెళ్ళికొడుకు కట్నం వద్దనడంతో ఏదో లోప ముందని కొందరు తామే పెద్ద ఉద్యోగం చేస్తామని తల్లిదండ్రులని వదిలేసి రమ్మని కొందరు అడి గారు.

కొన్ని వీళ్ళు వదిలేశారు. కొందరు వీళ్లని వదిలే శారు.

ఈ సంబంధం మాత్రం ఇరుపక్షాలకి నచ్చింది.

పెళ్ళిచూపుల సీను దాటి అభిప్రాయాలను తెలుసుకోవడం వరకూ వచ్చింది.

"నేను మీతో కొన్ని విషయాలు మాట్లాడతాను. మరో విధంగా భావించకండి..

మీరు కట్నం వద్దన్నారు కారణం?" అని అడి గింది.

ఆమె నిర్మొహమాటానికి అతను ఆశ్చర్యపో యాడు.

"మీ ఆస్తి వివరాలు చెప్పండి?" అంది.

బాణంలా దూసుకువచ్చిన ఆ ప్రశ్నకు ధీటుగా "ఆస్తులు ఏమీలేవు. అమ్మనాన్నలని అభిమా నంగా, ఆనందంగా చూసుకోవడం తప్ప" అన్నాడు.

"భవిష్యత్తులో ఏమైనా ఆర్థిక ఇబ్బందులు వస్తే?" అంది.

చంద్రం మౌనం వహించాడు.

"చూడండి! వరకట్నం తీసుకోవడం నేరమే. కాదనను. కానీ మీకు తగినంత ఆర్థికబలం లేదు. కట్నం ఇచ్చేవారి దగ్గర తీసుకోవడం తప్పులేదు. మీ అవసరాలకి వాడుకోకపోయినా భవిష్యత్తులో మన అవసరాలకి మరొకరి దగ్గర చెయ్యి చాచ కుంటే చాలు. కట్నం మీరు ఇంతని డిమాండ్ చెయ్యకండి. మా నాన్న కట్నం ఇచ్చే స్తోమతలో ఉన్నారు. తీసుకుని దాచండి" అంది.

'వద్దనుకునే' భయంకర అనుభవాలతో అతను–

'తీసుకుంటే తప్పేముంది' అనుకునే ఆలోచ నతో ఆమె–

ఒక అంశం మీద ఇరుదేశాల ఆర్థికమంత్రులు చర్చించుకున్నాక సంతకాలు చేసినట్లు వీరిద్దరి మధ్య ఒప్పందం కుదిరింది.

ఆ రాత్రి పడుకోవడానికి ముందు చంద్రం 'స్నేహితులు నవ్వుతారేమోనని అనుకున్నా. ఇచ్చి పుచ్చుకోవడం సాధారణ మర్యాద' అనుకుని నిద్ర పోయాడు.

'తగిన నీరుంటేనే నదిలో నావ హాయిగా సాగి పోతుందని, ఆదర్శాల దారి మోకాళ్లతో దాటడం కష్టమేనని' మాధురి ఆలోచించింది. సంవత్సరాల అభిప్రాయాన్ని కొన్ని నిముషాల్లో మార్చుకున్న అతన్ని గురించి ఆలోచిస్తూ అతనికున్న వినే స్వభావాన్ని అంచనా వేస్తూ ఆమె పడుకుంది.

ఆర్థికసూత్రాల విశ్లేషణ జరిగాక మంగళ సూత్రం 'ముడి'పడింది.

* * *

ఫస్ట్ నైట్...

పూలపరిమళాలు చంద్రాన్ని తొందరచేస్తు న్నాయి.

మాధురి తన ఉద్యోగం, పొదుపు, స్కూటర్, దేశ ద్రవ్యోల్బణం, పిల్లలు, చదువులు అంటూ దజన్ల కొద్దీ కాగితాలు రాసి అతనికి క్లాస్ తీసు కుంది.

టేబుల్ మీదున్న పాలగ్లాస్‌కేసి చూసి నిట్టూ ర్చాడు చంద్రం.

"ఇవాల్టికి పడుకోండి. నాకు నిద్ర వస్తోంది. మన స్వంత ఇల్లు కట్టుకోవడం, బ్యాంకులోను గురించి రేపు మాట్లాడదాం" అంది ఆవులిస్తూ.

ఆడది అర్ధశరీరం అంటే ఇదా! అని అటు తిరిగి స్వీటు ముక్కనోట్లో పడేసుకుని రఫ్ పేపర్లని ఫెయిర్ చేస్తున్న మాధురిని ఊహించుకుంటూ దుప్పటిని మీదికి లాక్కున్నాడు.

పాపం చంద్రం...

★